క్లుప్తంగా

నేత్రదానంపై అవగాహన కల్పించాలి

మధిర : నేత్రదానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని నేత్ర, అవయవ శరీర దాతల సంఘం అధ్యక్షుడు మాధవరపు నాగేశ్వరరావు కోరారు. ఆదివారం మధిర పట్టణంలోని కుందా సావిత్రి స్మారక భవనంలో ఉచిత హోమియా వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు నాగభూషణం, కామేశ్వరరావు, శ్రీనివాసరావు, శ్రీనివాస్, సతీష్, మురళీకృష్ణ, గోపాలకృష్ణ, మోహన్, కుటుంబరావు తదితరులు ఉన్నారు.

మేఘనకు తుమ్మల అభినందన



మేఘనను అభినందిస్తున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణానికి చెందిన ద్రోణవల్లి రఘు కుమార్తె మేఘన సిద్దిపేట మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. దీంతో మాజీ మంత్రి తుమ్మల దమ్మపేట మండలంలోని గండుగులపాడు గ్రామంలో ఆయన నివాసంలో మేఘనను అభినందించారు. ఈ సదర్భంగా విద్యకు తమవంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థులు



వేదాంత్



యశస్విని

వైరా/వైరారూరల్: వైరా మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మణపల్లికి చెందిన వేదాంత్, మండలంలోని కనకగిరి సిరిపురం గ్రామానికి చెందిన సొగంధి యశస్విని లు నీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఎంబీబీఎస్‌లో సీటు సాధించారు. వేదాంత్ సంగారెడ్డి జీయస్ జీఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించగా.. యశస్విని ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. ఈ సందర్భంగా ఇరువురు విద్యార్థులను పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

మధిర: బీఆర్ఎస్ పార్టీలో వర్గ విభేదాలతో ఎదురవుతున్న అవమానాలు భరించలేక రాజీనామా చేసినట్లు మధిర మండలం దెందుకూరు సర్పంచ్ కోట విజయశాంతి, సహకార పరపతి సంఘం అధ్యక్షుడు కోట వెంకటకృష్ణ దంపతులు వెల్లడించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీలో నేతలను నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజ్ సమన్వయ పర్చలేక పోతున్నారని తెలిపారు. తాము అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు చేస్తున్న వారు నిరూపించాలని సూచించారు.

భూపోరాట యోధుడు శ్రీశైలం



మాట్లాడుతున్న అరుణోదయ నాగన్న

కొణిజర్ల: భూ పోరాట యోధుడు పొట్లపల్లి శ్రీశైలం ఆశయాలను కొనసాగించాలని అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న అన్నారు. ఆదివారం మండలంలోని రామనర్సయ్యనగర్‌లో శ్రీశైలం రెండో వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా నాయకుడు విప్లవ్‌కుమార్, ఏఐకేఎంఎస్ నాయకులు ఖాసీమ్, పఠాన్ ఖాసీమ్ ఖాన్, గూగుల్ బాబు, మంగ్యా, ఉపేందర్, కృష్ణ, శంకర్, సీతయ్, కిషన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిరిపురంలో చీరలు పంపిణీ



చీరలు అందిస్తున్న బాలాజీ నాయక్


వైరారూరల్: మండలంలోని కేజీ సిరిపురం గ్రామంలో కాంగ్రెస్ కిసాన్ ఖేత్ రాష్ట్ర ఉపాధ్యాయుడు బానోత్ బాలాజీ నాయక్ ఆదివారం గడగడపకు తిరిగి సోనియమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



అక్షింతలు, కుంకుమ కలిగిన రాఖీ



ఫొటో రాఖీలు



వెండి రాఖీలు

భలే గిరాఖీలు..



సత్తుపల్లిలోని రాఖీల దుకాణం

- మండలంలో రాఖీల సందడి..
- మార్కెట్లో ఆకర్షణీయమైన మోడళ్లు
- జోరుగా సాగుతున్న కొనుగోళ్లు

సత్తుపల్లిటౌన్: అక్కా–తమ్ముళ్లు.. అన్నా–చెల్లెళ్ల అనురాగానికి.. అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. ఈ పండుగ కోసం సత్తుపల్లిలో రాఖీల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. రాఖీల కొనుగోళ్లతో దుకాణాలు సందడిగా మారాయి. ఈ నెల 30వ తేదీన జరుపుకునే రక్షా బంధన్‌ను పురస్కరించుకొని తమ సోదరులకు రాఖీలు కట్టి తమ అనుబంధాన్ని దృఢంగా చేసుకోవడానికి సోదరీమణులు సిద్ధమౌతున్నారు.

వైవిధ్యమైన రాఖీలు..

ప్రస్తుత ఆధునీకతకు తగ్గట్టుగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్కెట్‌లో వైవిధ్యమైన రాఖీలు వచ్చాయి. చెమ్కీ, స్టోన్ రాఖీలు, ఫ్యాన్సీ రాఖీలు, కుందన్‌లతో చేసిన డిజైన్ల రాఖీలు మార్కెట్‌లో లభిస్తున్నాయి. రూ.10 నుంచి రూ.500ల వరకు రాఖీల ధరలు ఉన్నాయి. అన్నా–వదిన రాఖీలు, అక్షింతలు, కుంకుమలతో ఉన్న రాఖీలు ఆకర్షణీయంగా ఉన్నాయి. వీటికి తోడు వెండి పూత రాఖీలు విక్రయిస్తున్నారు. దూర ప్రాంతాల్లోని తమ సోదరులకు రాఖీ పౌర్ణమి నాటికి రాఖీలు చేరుకునే విధంగా కొరియర్, పోస్టల్, కార్గో సర్వీస్‌ల ద్వారా పంపించటానికి మహిళలు ఆసక్తి చూపిస్తున్నారు. ఇంకా విభిన్నంగా మార్కెట్‌లో ఫొటో రాఖీలు ట్రెండ్‌గా మారాయి. రాఖీలో అన్నాచెల్లెళ్లు కలిసి ఉన్న ఫొటోలు పెట్టి రాఖీలు విక్రయిస్తున్నారు.

కొత్త డిజైన్లు వచ్చాయి..



కొత్త డిజైన్లలో గతంలో కంటే ఈ సారి ఎక్కువ వెరైటీలు అందుబాటులో ఉన్నాయి. పెద్దపల్లి, హైద్రాబాద్, విజయవాడ నుంచి 120కి పైగా వివిధ రకాల మోడల్స్ రాఖీలను తెచ్చి విక్రయానికి సిద్ధంగా ఉంచాం.

– దారా జగన్, వ్యాపారి, సత్తుపల్లి

స్వయంగా రాఖీ కడతా..



మా అన్నయ్యకు ప్రతి ఏటా స్వయంగా రాఖీ కడతా. ఉద్యోగ రిత్యా ఏ ఊరిలో ఉన్నా.. రాఖీ పౌర్ణమి రోజు మాత్రం కలుసుకొని రాఖీ కట్టడం సంతోషంగా ఉంటుంది. షాపుల్లో ఉండే అందమైన రాఖీని కొంటాను.

– డాక్టర్ ఆర్.మేఘన, సత్తుపల్లి

రాఖీలు బాగున్నాయి..



మార్కెట్‌లో చాలా వెరైటీలతో రాఖీలు ఉన్నాయి. వీటిని చూస్తుంటే ఏది తీసుకోవాలో అర్థం కావడం లేదు. ధరలు ఎలా ఉన్నా అన్నయ్య కోసం మంచి రాఖీ కొని కట్టడంలోనే నాకు చాలా సంతోషంగా ఉంటుంది.

– బి.సంజన, సత్తుపల్లి

గ్రామాల్లో బోనాల జాతర

మండలంలోని పలు గ్రామాల్లో గ్రామదేవతలకు ఆదివారం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలు పాలతో తయారు చేసిన పాయసాన్ని ప్రత్యేక పాత్రలో ఉంచి పాత్ర చుట్టూ వేప ఆకులు కట్టిన బోనాలను నెత్తిన పెట్టుకుని డప్పులు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మ, బోడ్రాయి లకు పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాయసాన్ని నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంటలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ముదిగొండ: మేడేపల్లిలో బొడ్రాయికి పూజలు చేస్తున్న మహిళలు



సత్తుపల్లిరూరల్: ముత్యాలమ్మకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



సత్తుపల్లిటౌన్: పూజలు చేస్తున్న భక్తులు



చింతకాని: ప్రొద్దుటూరు గ్రామంలో..



కల్లూరు: ముత్యాలమ్మ గుడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ప్లాస్టిక్ బియ్యం వచ్చాయని ఆందోళన



బియ్యాన్ని వేరు చేసిన దృశ్యం

బోనకల్: మండలంలో పలు రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం ప్రజలకు బియ్యం సరఫరా చేస్తుంది. అయితే, ఇందులో కల్తీ జరుగుతోందని కలకోట సర్పంచ్ యంగల దయామణి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెలలో తీసుకున్న బియ్యంలో ప్లాస్టిక్‌ను పోలిన బియ్యం వచ్చాయని తెలిపారు. వీటిని నానబెట్టిన క్రమంలో అవి నీటిపైకి తేలడంతో గుర్తించినట్లు చెప్పారు. అయితే, ఇవి ప్లాస్టిక్ బియ్యం కావని, ఫోర్టిఫైడ్ రైస్ అని రెవెన్యూ ఉద్యోగులు చెబుతున్నారు. కాగా, ప్రజలు ప్లాస్టిక్ బియ్యం అని అపోహ పడుతున్నందున అధికారులు ఇకనైనా అవగాహన కల్పించాలని పలువురు కోరారు.

ప్రజా ఉద్యమాల్లో యువత ముందుండాలి

కొణిజర్ల: ప్రజా ఉద్యమాలలో యువత ముందుండాలని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్వీ రాకేష్ , సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకుడు కంకణాల అర్జునరావు తెలిపారు. మండలంలోని తీగలబంజరలో ఆదివారం నిర్వహించిన పీవైఎల్ వైరా సబ్ డివిజన్ మహాసభ లెనిన్, కృష్ణల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ పథకాన్ని అటకెక్కించిన ప్రభుత్వం కొత్తగా ఎన్నికల వేళ గృహలక్ష్మి పేరుతో మరో కొత్త మోసాన్ని తీసుకొచ్చిందన్నారు. అనంతరం కృష్ణ, లెనిన్‌తో పాటు మరో ఏడుమందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ వైరా డివిజన్ కార్యదర్శి పాశం అప్పారావు, ప్రజాపంథా నాయకులు సీతారాములు, శ్రీను, రామారావు, అనిల్, అనంత రాములు, రాజేష్, సురేష్ పాల్గొన్నారు.

నిరుపేద వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ



సత్తుపల్లిటౌన్: వృద్ధులకు నిత్యావసరాలు అందిస్తున్న సత్యనారాయణ

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని మారుతి న్యూట్రీషన్ సెంటర్‌లో ఆదివారం నిరుపేద దివ్యాంగుల దంపతులకు స్థానిక ఇండేన్ గ్యాస్ కంపెనీ నిర్వాహకుడు వందనపు సత్యనారాయణ నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ద్రోణం రాజు మల్లికార్జున్ శర్మ, కొనకళ్ల పాండు రంగారావు, కానుగుల చెన్నారావు పాల్గొన్నారు.

సప్తపది లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో

పెనుబల్లి : మండలంలోని పెనుబల్లి బీసీ కాలనీకి చెందిన జిల్లెల శ్రీనివాసరావు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఆదివారం సప్తపది లయన్స్‌క్లబ్ సభ్యులు బియ్యం, సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ అబ్దుల్ సలాం, అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సెక్రటరీ సత్యనారాయణ, వినాయక ప్రసాద్, జయరాం, మంగపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

ఖమ్మం సహకారనగర్: మధిరలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సాయంత్రం బోనకల్, ముదిగొండ, మధిర మండలాలకు చెందిన మైనార్టీలకు ఆర్థికసాయం చెక్కులు అందజేయనున్నారు. ఈ చెక్కులను లబ్ధిదారులకు సీఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క పంపిణీ చేస్తారు.

పాలాభిషేకం



వైరా: ఖర్గే, సోనియా చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వైరా: గతంలో ఏ ప్రభుత్వం పనిచేయని విధంగా కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించిందని పీసీసీ సభ్యుడు రంగారావు, దరావత్ రామ్మూర్తి నాయక్‌లు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం వైరాలో ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హామీ ఇచ్చిన ప్రతి సంక్షేమ పథకాన్ని ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, అన్వర్, నాగరాజు, బాస్కర్, పుల్లయ్య, విశ్వనాథం, కిరణ్, లింగయ్య, సుధాకర్, హుస్సేన్ పాల్గొన్నారు.

అప్పారావుకు సన్మానం

సత్తుపల్లి: ఐఎన్‌టీయూ సింగరేణి కొత్తగూడెం ఏరియా కార్యదర్శిగా నియమితులైన సత్తుపల్లిలోని కిష్టారం గ్రామానికి చెందిన నరుకుళ్ల అప్పారావును సన్మానించారు. ఆదివారం స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, డాక్టర్ రాగమయి, కమల్ పాషా, చల్లారి వెంకటేశ్వరరావు, బత్తుల భరత్, దొడ్డా శ్రీనివాసరావు, యూనిస్, చెన్నారావు, వంగరి రాకేష్ పాల్గొన్నారు.

తూటికుంట్లలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ సౌభాగ్యం

బోనకల్: మండలంలోని తూటికుంట్ల గ్రామ ఎస్సీ కాలనీలో ఆదివారం ఎంపీపీ కంకణాల సౌభాగ్యం సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. దీనికి ఎంపీటీసీ నిధుల నుంచి సీసీ రోడ్డు నిర్మిచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటనర్సమ్మ, రైతుబంధు కన్వీనర్ ప్రసాద్, రమేష్, వైస్ సర్పంచ్ కొండలరావు, అఖిలపక్ష నాయకులు రామనర్సయ్య, వెంకటయ్య, చిన్నప్ప, పణితి బాలరాజు, కృష్ణ, లక్ష్మీనర్సయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ విజయం వరించాలి

సత్తుపల్లి: సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు మళ్లీ విజయం వరించాలని హనుమాన్ నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ ప్రత్యేక పూజలు చేశారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి కరపత్రాలను అందించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రఫీ, అంకమరాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించండి



ముదిగొండ: పోలింగ్ బూత్‌లో పరిశీలిస్తున్న ఆర్డీఓ గణేష్

సత్తుపల్లిరూరల్/ముదిగొండ : అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని కల్లూరు ఆర్డీఓ అశోక్ చక్రవర్తి, ఖమ్మం ఆర్డీఓ గణేష్‌లు ఆదేశించారు. ఆదివారం సత్తుపల్లిలో మండలంలో, ముదిగొండలోని సువర్ణాపురం, ముదిగొండ, వల్లాపురం గ్రామాల్లోని ప్రత్యేక ఓటరు నమోదు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. బీఎల్‌ఓలకు ఓటు మార్పులు, చేర్పులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు యోగీశ్వరరావు, రామారావు, ఆర్ఐలు జాని, నరేష్, బీఎల్ఓలు ఉదయ్‌శ్రీ, విజయ, వీరకుమారి, రమాదేవి, రమేష్ పాల్గొన్నారు.

కల్లూరురూరల్/ఎర్రుపాలెం: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్, మున్నే ఉషాశారదలు కోరారు. ఆదివారం కల్లూరులోని 63 పోలింగ్ కేంద్రాలను, ఎర్రుపాలెంలోని ఇనగాలి, తక్కెళ్లపాడు, సఖినవీడు, ములుగుమాడు, మీనవోలు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కేంద్రాలను వారు పరిశీలించి మాట్లాడారు. ప్రత్యేక క్యాంపెయిన్‌లో.. బీఎల్‌ఓలు కొత్త ఓటురు నమోదుకు ఫారం 6, అభ్యంతరాలకు ఫారం 7, మార్పులకు ఫారం 8 లు స్వీకరించడం జరిగిందన్నారు. దరఖాస్తు చేసుకున్న యువత తమ దరఖాస్తులను సంబంధిత బీఎల్‌ఓలకు గానీ, తహసీల్‌లో కానీ సమర్పించాలన్నారు. లేదా ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా తమ ఓటు హక్కుకోసం దరఖాస్తు చేయొచ్చని తెలిపారు. ఈ క్యాంపులు వచ్చేనెల 3వ తారీకు వరకు ఉంటుందన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



ఆందోళన చేస్తున్న సర్పంచ్ రామారావు, స్థానికులు

కొణి జర్ల: గత మూడు రోజులుగా తాగునీరు సరఫరా లేకపోవడంతో కొణిజర్ల గ్రామస్తులు సర్పంచ్ సూరంపల్లి రామారావు నేతృత్వంలో తనికెళ్ల ముక్రి హిల్స్ వద్ద ఉన్న మిషన్ భగీరథ హెడ్ వర్క్స్ గేటు ఎదుట ఆందోళన నిర్వహించారు. తరచూ తాగునీటి సరఫరాలో అంతరాయం కలగడంతో ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు సమస్యను పరిష్కరించకపోతే మొత్తం హెడ్ వర్క్స్‌కే తాళం వేస్తామని హెచ్చరించారు. దీంతో విషయం తెలుసుకున్న డీఈ నరసింహమూర్తి, ఏఈ చైతన్యలు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడుతూ.. కొణిజర్ల సెంటర్‌లో గేట్ వాల్వ్‌లో సమస్య వలన నీటిని సరఫరా చేయలేకపోయామని, వర్కర్లు సమ్మెలో పాల్గొన్నడంతో మరమ్మతులు చేయలేదని తెలిపారు. దీంతో గ్రామస్తులు సమస్యను పరిష్కరించేవరకు కదిలేదే లేదని బీష్మించుకు కూర్చోవడంతో సమస్యను ఉన్నతాధికారులకు తెలిపారు. దీంతో వారు తక్షణమే కొత్త గేట్ వాల్వ్ మంజూరు చేసి ప్రైవేట్ వ్యక్తులచే మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు ముత్తారావు, ఉపేందర్, భాస్కర్, శ్రీను, హుస్సేన్, నాగ, బబ్లూ నాగరాజు, సతీష్, కోటి పాల్గొన్నారు.

గేట్‌వాల్వ్‌కు మరమ్మతులు..

అనంతరం డీఈ మూర్తి, ఏఈ చైతన్యలు కొణిజర్లలో సాయంత్రం వరకు ఉండి కొత్త గేట్ వాల్వ్ ఏర్పాటు చేయించి నీటి సరఫరా పునరుద్ధరించారు.

అమిత్‌షా సభకు తరలిన బీజేపీ శ్రేణులు



సత్తుపల్లి: ఖమ్మం అమిత్‌షా సభకు వెళ్తున్న బీజేపీ శ్రేణులు

సత్తుపల్లి/ఎర్రుపాలెం/చింతకాని: ఖమ్మంలో ఆదివారం జరిగిన బీజేపీ బహిరంగ సభకు సత్తుపల్లి, ఎర్రుపాలెం, చింతకాని మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. సత్తుపల్లి నియోజకవర్గం నుంచి బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో 20 బస్సుల్లో వెళ్లారు. ఎర్రుపాలెం మండలం నుంచి.. బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడు నూతక్కి నర్సింహారావు, మండలాధ్యక్షుడు శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో, చింతకాని మండలం నుంచి వందలాదిగా టాటాఏస్‌లు, కార్లు, బస్సుల్లో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాలకొల్లు శ్రీనివాస్, ఆచంట నాగస్వామి, భాస్కర్ల వీరంరాజు, ఎస్‌కె రహ్మతుల్లా, ఎస్‌కె సుభాని, భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సాలి కృష్ణస్వామి, యలమర్తి ప్రసాద్, బండి వేణుగోపాల్‌రెడ్డి, బండి ఆంజనేయులు, దేవరకొండ కోటేశ్వరరావు, చంద్రమౌళి, ధనంజయశర్మ, మోహన్‌రావు, మద్దినేని వెంకటేశ్వరరావు, కొండా గోపి, కోట సికిందర్, వీరప్రసాద్, పానకాలరావు, నర్సింశెట్టి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రైతు నాయకుల అరెస్ట్ అక్రమం



వైరా: పోలీస్ స్టేషన్‌లో బొంతు రాంబాబు

వైరా: ఖమ్మంలో నిర్వహించే కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా సభ సందర్భంగా.. రైతు సంఘం నాయకులను అరెస్ట్ చేయడం అక్రమమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం వైరాలో రైతు సంఘం నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాంబాబు విలేకర్లతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వందలాది మంది రైతులు ఉసురు తీసుకుని.. ఇప్పుడు ఎన్నికల సందర్భంగా రైతు భరోసా అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుల మేలు కోరే ఏ ప్రభుత్వం అయినా రైతు సంఘాల సలహాలు తీసుకుంటుంది తప్ప ఇలా నిర్బంధాలకు గురి చేయదన్నారు.

అరెస్టులను ఖండించండి..

సత్తుపల్లిరూరల్: కేంద్ర హోం శాఖామంత్రి అమిత్ షా ఖమ్మం పర్యటన సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జి.రామయ్య, ఇతర కార్మిక సంఘాల నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు ఎ.శరత్ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొందరు పోలీసులు ఇంట్లో ఉన్న తమ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. కార్మికుల హక్కుల సాధనకై ఉద్యమాలు చేస్తున్న నాయకులను అరెస్ట్ చేయడాన్ని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడి, 4 లేబర్‌కోడ్లను రద్దు చేయాలన్నారు. గుజరాత్‌లో మైనార్టీలు, పేదలపై మారణకాండను సృష్టించిన హంతకుడు, మణిపూర్ కుకీ, నాగాల మారణకాండకు కారణమైన అమిత్‌షాకు ఖమ్మంజిల్లాలో పర్యటించే అర్హత లేదన్నారు. ప్రశాంతంగా ఉన్న ఖమ్మం జిల్లాలో మతచిచ్చు రేపటానికి, ప్రజల మధ్య విభజనలు తీసుకు రావడానికి ఖమ్మం వస్తున్నాడని ఆయన ఆరోపించారు.

నేడు మధిరలో పొంగులేటి పర్యటన



రాజులదేవరపాడులో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం మధిర నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సాయంత్రం 3.30 గంటలకు మధిర మండలంలోని ఆత్కూరు క్రాస్ రోడ్డు నుంచి శ్రీరస్తు ఫంక్షన్ హాల్ వరకు మోటర్ సైకిల్ ర్యాలీలో పొంగులేటిసహా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కోటా రాంబాబు పాల్గొంటారు. అనంతరం ఫంక్షన్ హాల్‌లో జరిగే సమావేశంలో వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరనున్న మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాల నాయకులు, కార్యకర్తలకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తారు. ఈమేరకు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి కోరారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు..

ఎర్రుపాలెం: మండలంలోని పలు గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శీలం ప్రతాపరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రాజులదేవరపాడులో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యకర్తలు, నాయకుల సమావేశంలో మాట్లాడారు. మధిరలో సోమవారం జరిగే కార్యక్రమంలో చేరికలు ఉంటాయన్నారు.

పరిశుభ్రత పాటించాలి



మొబైల్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగమణి

చింతకాని : ప్రతి ఒక్కరూ పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గ్రామ సర్పంచ్ ఆలస్యం నాగమణి అన్నారు. ఆదివారం మండలంలోని నాగులవంచ గ్రామంలో.. ఖమ్మం నగరానికి చెందిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మొబైల్ ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్య శిబిరంలో వైద్యులు రోగులకు పలు రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వెలిశేటి చంద్రమోహన్, సభ్యులు ఉప్పలయ్య, జనార్ధన్ రావు, నర్సయ్య, టీమ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, వైద్యులు హరినాథ్‌బాబు, నర్సింహారావు పాల్గొన్నారు.